# జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM


సోమవారం 15 12 2025

సంపుటి 1 సంచిక 24

పేజీలు : 04

RNI : TGTEL/25/A4195


## 1950: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ కేంద్ర మంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ మరణం.



2005: అంతర్జాతీయ టీ దినోత్సవం
1933: చిత్రకారుడు బాపు జననం. (మ.2014).
1938: కథారచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య జననం. (మ.2018)
1939: కవి, విమర్శకుడు నూతలపాటి గంగాధరం జననం. (మ.1975)
2014: తెలుగు సినిమా సంగీత దర్శకుడు చక్రి మరణం. (జ.1974).



చరిత్రలో ఈ రోజు



## మా సహనాన్ని పరీక్షించవద్దు: కేటీఆర్ వార్నింగ్

అన్నదాతలకునీళ్లు ఇవ్వడానికికృషి చేశామని. తుంగతుర్తికికాళేశ్వరంనీళ్లు తెచ్చామనిగుర్తుచేశారు. ఇప్పుడు మాత్రందారుణమైనపరిస్థితులుఉన్నాయని కేటీఆర్ఆవేదనవ్యక్తంచేశారు.


2



## యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు

దర్శనానికిరెండు గంటలు ప్రత్యేక దర్శనానికిగంటసమయం. భక్తులనుండి వచ్చినఒక్క రోజు ఆదాయం 52 లక్షలు.

3



## గేమ్ ఛేంజర్ కానున్న 13 ప్రాజెక్టులు

తెలంగాణ రైజింగ్‌విజన్ -2047 డాక్యుమెంట్‌నుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్లోబల్ సమ్మిట్ వేదికగా ఆవిష్కరించారు.

4



## పోల్కంపల్లి లో ప్రశాంత్ కుమార్ రెడ్డి గడప..గడప ప్రచారం


ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో, బీఆర్ఎస్–బీజేపీ పార్టీల మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొమ్మిడి జంగారెడ్డి కి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆదివారం గడప–గడప ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ కత్తెర గుర్తుకు ఓటు వేసి కొమ్మిడి జంగారెడ్డి తో పాటు వార్డుల్లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్–బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను ఆయన విజ్ఞప్తి చేశారు.

-(దశ, ఇబ్రహీం పట్నం )

# ఓడిన,గెలిచిన కాంగ్రెస్ పార్టీలోకే...

## కండువాలు కప్పేందుకు సన్నాహాలు

“ఎవరు గెలిస్తే మనకేంటి.. మన పార్టీలో చేరితే చాలు.. అన్న చందగా ఉంది అధికార కాంగ్రెస్ నియోజకవర్గ నేతల పరిసితి కనిపిస్తుంది. సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాలలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక ఆ పార్టీ నేతలకు పెద్ద తలనొప్పిగా మారిందని చెప్పవచ్చు.



**దశ, కోదాడ :**

తొలినుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నవారు.. అధికారం వచ్చిన తర్వాత పార్టీలో ఇబ్బడి ముబ్బడిగా చేరిన నాయకుల మధ్య సర్పంచ్ ఎన్నికలు వివాదానికి తెరతీశాయి. అయితే బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం ఈ ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధపడటం విశేషం. తాము బలంగా ఉన్నచోట కాంగ్రెస్ రెబల్ శ్రేణులతో పోటీ చేస్తూ వారు బలంగా ఉన్నచోట బీఆర్ఎస్ మద్దతిస్తుండటం స్పష్టంగా కనిపిస్తుంది... కాగా ఈ మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మాత్రం అధికారికంగా గుర్తులు లేకపోవడంతో తాము మద్దతిచ్చిన అభ్యర్థులు ఓడినప్పటికీ గెలిచిన వారు కూడా తమ వారేనని కాంగ్రెస్ కండువాలు కప్పేందుకు సన్నాహాలు చేస్తుండటం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేస్తుంది. మెజారిటీ గ్రామ పంచాయతీల అభ్యర్థుల ఎంపికలు అధికార పార్టీ అధికార అభ్యర్థులుగా ప్రకటించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామంలో పార్టీ పరువు దక్కించుకునేందుకు గెలిచిన అభ్యర్థులను తమ పార్టీ ఖాతాలో వేసుకునేందుకు నియోజకవర్గ ముఖ్య నాయకులకు పురమాయించినట్లు తెలుస్తుంది. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు నానా కష్టాలు పడ్డామని తమ గ్రామాలలో మెజారిటీ వచ్చేందుకు సొంత డబ్బులు

మిగతా 4వ పేజీలో



## చెలరేగిన టీమిండియా బౌలర్లు..

### స్వల్ప స్కోరుకే పరిమితమైన దక్షిణాఫ్రికా..

**దశ, ధర్మశాల:**

ధర్మశాల వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టీ20లో భారత బౌలర్లు చెలరేగారు. సమష్టిగా రాణించి దక్షిణాఫ్రికాను తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. టీమిండియా బౌలర్ల ధాటికి దక్షిణాఫ్రికా బ్యాటర్లు చేతులెత్తేశారు. ఏకంగా 8 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. దీంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది.
టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ టీమిండియా బౌలర్లు చెలరేగారు. హర్షిత్, అర్ష్‌దీప్ ధాటికి దక్షిణాఫ్రికా 7 పరుగులకే మూడు టాపార్డర్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే ఒక పక్క వికెట్లు పడుతున్నప్పటికీ ఐడెన్ మార్క్‌రమ్ (61) మాత్రం ఒంటరి పోరాటం చేశాడు. డోనావన్ (20), నోర్ట్జే (12) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు

4వ పేజీలో



## మహానగరంలో డ్రగ్స్ వినియోగం..

- లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

**దశ, హైదరాబాద్ :**

మహానగరంలో డ్రగ్స్ వినియోగం రోజు రోజుకు పెరుగుతోంది. వీటికి బానిసలవుతున్న వారి సంఖ్య అంతకంతకు రెట్టింపు అవుతోంది. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా.. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఎప్పుడో అప్పుడు ఏదో ఒక ప్రాంతంలో డ్రగ్స్ పట్టుబడుతునే ఉన్నాయి. అలాంటి వేళ.. ఆదివారం హైదరాబాద్‌లో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్,

మిగతా 4వ పేజీలో

## పోలింగ్ నిర్వహణ,ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**దశ, రంగారెడ్డి:**

గ్రామ పంచాయతీ ఎన్నికల రెండవ విడత పోలింగ్ ను సజావుగా ప్రశాంత వాతావరణంలోనిర్వహిస్తున్నట్లుజిల్లాకలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం రంగారెడ్డి జిల్లాలో రెండవ విడుతలో 7 మండలాలో ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా కనకమామిడి,కేతిరెడ్డిపల్లి ,ముడిమ్యాల,పొత్ గల్,షాబాద్,సర్దార్ నగర్ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు.ఓటర్ జాబితా ప్రకారం ఓటింగ్ ప్రక్రియను



నిర్వహించాలని,ఎలాంటి తప్పిదాలు జరగకుండా విధులు నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. పోలింగ్

మిగతా 4వ పేజీలో



# పాపన్న గౌడ్ స్ఫూర్తినీయుడు

- ఎల్బీనగర్ లో సర్దార్ విగ్రహావిష్కరణ
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

**దశ, ఎల్బీనగర్ :** బహుజనుల గౌరవం, ఆత్మగౌరవం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, ఆయన నేటి యువతరానికి స్ఫూర్తినీయుడని ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గౌడ సంఘం నాయకులు కొనియాడారు.ఎల్బీనగర్ కామినేని దవాఖాన రోడ్డులో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... బహుజన గౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. సమాజానికి ఆయన చేసిన త్యాగాలు, సేవలు మరువలేనివని, మహానీయుల చరిత్రను రాబోయే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ బహుజన చైతన్యానికి, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవా సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల మల్లేశ్ గౌడ్, మాజీ శాసన మండలి చైర్మన్ కె.స్వామి గౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## రైతుల నీటి హక్కులపై ఉద్యమానికి బీఆర్ఎస్ సిద్ధం

- 19వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈ సమావేశం.
- కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం.

**దశ, హైదరాబాద్ :**

రైతుల నీటి హక్కులపై ఉద్యమానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సమాయత్తమవుతోంది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం కానుంది. డిసెంబర్ 19వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. కృష్ణా, గోదావరి జలాలతోపాటు సాగునీటి ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అంతేకాకుండా.. తదుపరి నిర్మించబోయే తెలంగాణ ప్రజా ఉద్యమాలకు సంబంధించి పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో లోతుగా చర్చించనుంది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 4వ పేజీలో





# రెస్టారెంట్‌లో యువ హీరో సందడి

**దశ, హైదరాబాద్ :** మల్కాజ్గిరిలో నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధ్ విలాస్ – ప్యూర్ వెజిటేరియన్ రెస్టారెంట్‌ను యువ కథానాయకుడు శ్రీ విష్ణు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణు తో పాటు నిర్వాహకులు శశికాంత్ శ్రీరామ్, ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల, కోన వెంకట్, మల్కాజ్‌గిరి బ్రాంచ్ భాగస్వాములు రాజీవ్, రాజా శేఖర్, హుస్సేన్, వెంకట్ మార్తాండ్ పాల్గొన్నారు. నేటి ఆధునిక జీవనశైలికి తగిన విధంగా వంటకాలు అందించడం అభినందనీయమని సినీ కథానాయకుడు శ్రీ విష్ణు అన్నారు. నగరంలో ప్యూర్ వెజిటేరియన్ రెస్టారెంట్లు చాలా అరుదుగా ఉన్నాయని... మంచి రుచికరమైన శాఖాహార వంటకాలను అందించేందుకు రెస్టారెంట్ ను అందుబాటులోనికి తీసుకురావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## మెస్సీతో కలిసి ఆడిన ఎంజేపీ కళాశాల విద్యార్థి



**దౌల్తాబాద్, దశ:** సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థి నగేష్ క్రీడల్లో అరుదైన ఘనత సాధించాడు. ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన ఫుట్‌బాల్ గోట్ కప్‌లో సీఎం రేవంత్ రెడ్డి జట్టు తరఫున పాల్గొన్న నగేష్ విజేతగా నిలిచాడు. ఈ పోటీల్లో ముఖ్యమంత్రి వర్సెస్ ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనెల్ మెస్సి జట్లు తలపడగా నగేష్ మెస్సితో కలిసి మైదానంలో ఆడే అవకాశం పొందాడు. విజయం అనంతరం మెస్సి చేతుల మీదుగా గోట్ కప్‌ను స్వీకరించాడు.ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఆడటం, అలాగే మెస్సిని ప్రత్యక్షంగా కలవడం జీవితంలో మరచిపోలేని అనుభూతిగా నిలిచిందన్నారు.విద్యార్థి విజయం పట్ల కళాశాల ప్రిన్సిపల్ స్వప్న, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి కృష్ణ, బసవరాజ్, డాంబు తదితరులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## దౌల్తాబాద్ సర్పంచ్‌కు ఘన సన్మానం



**దశ, దౌల్తాబాద్:** సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ సర్పంచిగా ఎన్నికైన ముచ్చమర్రి అనురాధ రమేష్‌ను శుక్రవారం రాత్రి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దౌల్తాబాద్ పట్టణాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలందరి సహకారం అవసరమని తెలిపారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సర్పంచిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆమె చూపుతున్న చొరవను కొనియాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని ప్రశంసించారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి




**దశ, దౌల్తాబాద్:** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో మొదటి విడత ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని, తెలంగాణ ఉద్యమ కాలం నుంచే మండల ప్రజలు కేసీఆర్ నాయకత్వంలో పార్టీకి అండగా నిలుస్తున్నారని అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన ప్రజా ప్రతినిధులు గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు.. ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా భవిష్యత్తులో మరిన్ని అవకాశాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రహీముద్దీన్, మండల యూత్ అధ్యక్షుడు నర్ర రాజేందర్, మాజీ సర్పంచ్ మోహన్ రావు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర ఆలయంలో ఘనంగా మాస కల్యాణోత్సవం



**దశ, దౌల్తాబాద్:** సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి నెల రెండవ శనివారం నిర్వహించే మాస కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించడంతోపాటు పల్లకి సేవ, అలంకరణ తదితర కార్యక్రమాలను ఆలయ పూజారి వెంకటేశం, ఆలయ నిర్వాహకులు నిర్వహించారు. కల్యాణోత్సవంలో శ్రీరాం అరుణ, శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు, అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# మా సహనాన్ని పరీక్షించవద్దు: కేటీఆర్ వార్నింగ్



**దశ, సూర్యాపేట :** కాంగ్రెస్ శ్రేణుల దాడిలో మృతిచెందిన తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పుల మల్లయ్య కుటుంబాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్ల ప్రభుత్వంలో తుంగతుర్తిలో శాంతి వెల్లివిరిసిందని అన్నారు. అందరి సంతోషం కోసం కలిసి పనిచేశామని తెలిపారు. పేదల కడుపు నింపడం కోసం పనిచేశామన్నారు. అన్నదాతలకు నీళ్లు ఇవ్వడానికి కృషి చేశామని.. తుంగతుర్తికి కాళేశ్వరం నీళ్లు తెచ్చామని గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం దారుణమైన పరిస్థితులు ఉన్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. లింగంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తను దారుణంగా హత్య చేశారని తెలిపారు. ఇక్కడ అధికార దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.

ఎల్లమ్మగూడెం గ్రామంలో మా సర్పంచ్ అభ్యర్థి భర్తను కిడ్నాప్ చేశారని.. అతనితో మూత్రం తాగించి, దాష్టీకం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిరేకల్‌లో ఓట్లు గల్లంతు చేశారని అన్నారు. ఉత్తమ్ ఏరియాలో అయితే అరాచకాలు చేస్తున్నారని.. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దౌర్జన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. మేం అధికారంలో ఉన్నప్పుడు అందర్నీ గౌరవించామని.. ఎక్కడ దాడులు చేయలేదన్నారు. మేం సంయమనం కోల్పేతే మీరు మిగలరు అని హెచ్చరించారు. మా సహనాన్ని పరీక్షించవద్దని సూచించారు. కాంగ్రెస్ గుండాల్లారా తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మల్లయ్య కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుతంత్రాలు చేసినా, ఇవాళ రాష్ట్రంలో 50 శాతం సర్పంచ్‌లను గెలుచుకున్నామని తెలిపారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ ఎదురుచూస్తున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.



## ప్రశాంతంగా రెండో దశ ఎన్నికలు

❖ భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్

**దశ, భువనగిరి :** రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతుందని భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ అన్నారు. రెండో దశ గ్రామపంచాయతీ జరుగుతున్న భువనగిరి మండలాల్లో ఈరోజు భువనగిరి డీసీపీ బొల్లాపల్లి, భువనగిరి రూరల్ పోలీస్టేషన్ పరిధిలోని బస్వాపూర్, రామన్న పేట, వలిగొండ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బంది పనితీరును, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని అధికారులకు, సిబ్బందికి ఆయన సూచించారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకోవడం, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పర్యవేక్షించడంలో పోలీస్ యంత్రాంగం నిమగ్నమై ఉందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.



## డాక్టర్స్ కాలనీ డివిజన్ పేరు మార్చాలి

❖ సీపీఐ నాయకుల డిమాండ్

**దశ, ఎల్బీనగర్:** కొత్తగా ఏర్పాటు చేస్తున్న డాక్టర్స్ కాలనీ డివిజన్ పేరు మార్చాలని, అత్యధిక సంఖ్యలో పేదలు నివసిస్తున్న భగత్ సింగ్ నగర్, శంకర్ నగర్ కాలనీలను కలిపి భగత్ సింగ్ నగర్ డివిజన్ గా మార్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ సరూర్ నగర్ మండల కార్యదర్శి రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నర్సింహ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ... సీపీఐ ఆధ్వర్యంలో ఆనాడు కామ్రేడ్ సయ్యద్ అజీజ్ పాషా నాయకత్వంలో భూ పోరాటం నిర్వహించి పేదలకు గుడిసెలు వేయించి, ఇళ్ల పట్టాలు ఇప్పించి ఏర్పాటు చేసిన కాలనీ భగత్ సింగ్ నగర్ అన్నారు. కొత్తగా ఏర్పడిన 34వ డివిజన్ కు భగత్ సింగ్ నగర్ పేరును పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ నగర్ ఫేస్ 1, 2, శంకర్ నగర్ కాలనీలో అధిక సంఖ్యలో పేదలు నివసిస్తున్నారని, కొత్తగా వచ్చిన డాక్టర్స్ కాలనీ పేరు పెట్టడం సరికాదన్నారు. సరూర్ నగర్ డివిజన్ నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన డివిజన్ కు భగత్ సింగ్ నగర్ గా పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మీర్ పేట్ గోపాల్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మారగొని ప్రవీణ్ కుమార్ గౌడ్, సీపీఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు కమలమ్మ, ఎండీ మహబూబ్, సరూర్ నగర్ మండల కార్యవర్గ సభ్యులు ఎండీ జాహెద్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలదారులకు అల్పాహారం అందజేసిన అహ్మద్ హుస్సేన్ ఖాద్రి



**దశ ఓయూ :** మత సామరస్యానికి గత కొన్ని సంవత్సరాలుగా మానికేశ్వర్ నగర్ కు చెందిన మీ స్కిన్ బైతుల్ మాల్ ట్రస్ట్ నిర్వాహకులు మహమ్మద్ హుస్సేన్ ఖాద్రి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి సంవత్సరం అయ్యప్ప మాలదారులకు అల్పాహారం అందజేస్తూ తన మానవత్వాన్ని చాటుకుంటున్నాడు. ఇందులోభాగంగా శనివారం మాణిక్యేశ్వర్ నగర్ లోని 7 టెంపుల్స్ కమ్యూనిటీ హాల్లో అయ్యప్ప భక్తులతో కలిసి పూజలో పాల్గొన్నారు. అనంతరం మాలదారులకు అల్పాహారం అందజేశారు. వారితో కలిసి స్వయంగా అల్పాహారాన్ని ఆరగించారు. ఈ సందర్భంగా ఖాద్రి మాట్లాడుతూ మనం బ్రతికినంత కాలం అందరితో స్నేహపూర్వకంగా , ప్రేమగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 7 టెంపుల్స్ చైర్మన్ గండికోట విజయ్ కుమార్, దాదాపు 65. మంది అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు. సహదేవ గురుస్వామి,ఎల్లయ్యా గురుస్వామి, లక్ష్మణ్ గురుస్వామి,కృష్ణ గురుస్వామి,శ్రీనివాస్,రాజేష్,రామ్ చరణ్ , రాము,రాజు ,శివ , రేవంత్ సతీష్,నాగరాజు,చింటూ , చిలుక రాము ,సాయి తదితరులు స్వాములు పాల్గొన్నారు.

## చౌడాపూర్‌లో దారుణం

❖ అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

**దశ, వికారాబాద్ :** చౌడాపూర్ మండల కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. తమ అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను భార్య హత్య చేయించింది. భర్తను ట్రాక్టర్‌తో గుద్దించి చంపి.. దానిని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. అయితే మృతుడు సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. చౌడాపూర్‌లో రత్నయ్య, కవిత భార్య భర్తలు. అదే గ్రామానికి చెందిన రామకృష్ణతో కవితకు పరిచయం ఏర్పడింది. ఇది వారి మధ్య అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈ విషయం.. భర్త రత్నయ్యకు తెలిసింది. దాంతో కవితను రత్నయ్య మందలించాడు. దీంతో తమ అక్రమ సంబంధానికి అడ్డొస్తున్న రత్నయ్యను హత్య చేసేందుకు కవితతోపాటు ఆమె ప్రియుడు రామకృష్ణ పథకం పన్నారు. ఉదయం పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న రత్నయ్యను రామకృష్ణ ట్రాక్టర్‌తో బలంగా ఢీ కొట్టాడు. తీవ్రగాయాలతో అతడు అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తొలుత ప్రమాదంలో రత్నయ్య మరణించారని పోలీసులు భావించారు. రత్నయ్య మృతిపై అతడి సోదరుడు పోలీసుల ఎదుట సందేహం వ్యక్తం చేశాడు. పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేపట్టారు.



## కరాటే పోటీల్లో హయత్ నగర్ విద్యార్థులకు పతకాలు

**దశ, ఎల్బీనగర్ :** జాతీయ స్థాయి కుంగ్‌ఫు కరాటే, టైక్వాండో ఛాంపియన్ షిప్ 5వ పోటీల్లో హయత్ నగర్ విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించారు. జీడిమెట్లలోని షాపూర్ నగర్ ఎంజీ గార్డెన్ లో ఆదివారం చరణ్ సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 5వ జాతీయస్థాయి కుంగ్ ఫూ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో హయత్ నగర్ కు చెందిన మాస్టర్ ఎం.శివగౌడ్ ఆధ్వర్యంలో టైగర్స్ కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థులు 9 మంది పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో ఐదుగురు విద్యార్థులు వి.విష్ణుతేజ గోల్డ్ మెడల్, కె.సాయిచందు సిల్వర్ మెడల్, ఆర్.మనోజ్, వి.త్రిలోచన్, ఎం.సృజన్ బ్రాంజ్ మెడల్, 14వ కాటస్ విభాగంలో ఎన్.జస్రత్ సాయి, కె.లోకేష్, కె.దీక్షిత్ గోల్డ్ మెడల్, ఎం.శ్రీనిధి సిల్వర్ మెడల్ సాధించారు. అకాడమీ రాష్ట్ర కార్యదర్శి మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. కరాటేతో మంచి ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మ రక్షణ, శరీర దృఢత్వం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ మునుకుట్ల శివ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎస్‌పీఎస్ హై స్కూల్‌లో ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

**దశ, హైదరాబాద్:** కొంపల్లిలోని ఎస్‌పీఎస్ హై స్కూల్లో సిల్వర్ జూబ్లీ సందర్భంగా వార్షికోత్సవం 'సంకల్ప్ 2025' ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల కట్టుబాటును స్పష్టంగా చాటింది. పాఠశాల ప్రాంగణం క్రీడాస్ఫూర్తి, యువత ఉత్సాహంతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. నాలుగు హౌస్‌ల విద్యార్థుల అద్భుతమైన మార్చ్‌పాస్ట్‌తో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం సంప్రదాయ దీప ప్రజ్వలన చేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా వైస్ ప్రెసిడెంట్, డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సాయిలేష్ సంపతి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపిక సంపతి, హెడ్ మిస్ట్రెస్ వై. శారద హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిలేష్ సంపతి మాట్లాడుతూ.. "'సంకల్ప్' అంటే దృఢ సంకల్పం. ఈ రోజు మా విద్యార్థులు తమ ఉత్సాహభరితమైన పాల్గొనడంవల్ల ఆ సంకల్పాన్ని సాకారం చేశారు. క్రమశిక్షణ, విలువలు, మానవ ఉత్తమతను పెంపొందిస్తూ ఎస్‌పీఎస్ హై స్కూల్ యువకులకు నిరంతరం ప్రేరణనిస్తోంది" అని తెలిపారు.



# ధారూర్ మండల కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం

**దశ, వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా ధారూర్ మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాప్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం ధాటికి మంటలు ఎగసిపడున్నాయి. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. నీటితో మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు స్థానికులు. ఈక్రమంలో అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకున్నారు. మరోవైపు పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటన విషయాన్ని ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకులకు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, ఈ ఘటన జరగడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో దగ్గరలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





# యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు

- దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం..
- భక్తుల నుండి వచ్చిన ఒక్క రోజు ఆదాయం 52 లక్షలు..



**దశ,యాదగిరిగుట్ట:** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో హైదరాబాద్ పట్టణం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో యాదగిరిగుట్టకు పైనమయ్యారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, వ్రతాలు చేసి ముక్కలు చెల్లించుకున్నారు.యాదగిరిగుట్టకు వచ్చిన భక్తుల అలరించేందుకు టెంపుల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీ గణపతి నృత్యాలయం (హైదరాబాద్) వారిచే పేరిణీనృత్య ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.





# ఉన్నత విద్యతోనే బదిర మహిళల సాధికారత

- అదనపు కలెక్టర్ కదిరవన్ పలని.
- బదిర మహిళల జాతీయ సదస్సు విజయవంతం..




**దశ, ఓయూ:** సాంకేతిక సహకారం, ఉన్నత విద్యతోనే బదిర మహిళల సాధికారత సాధ్యం అవుతుందనీ హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలనీ అన్నారు. ఈ మేరకు ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో తార్నాక సెయింట్ ఆన్స్ జనరలేట్లో నిర్వహిస్తున్న బదిర మహిళల రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు విజయవంతం అయ్యింది. ఆదివారం జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిర మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఎదురయ్యే ఒడిదొడుకులను అధిగమిస్తూ అన్ని రంగాల్లో రాణించాలనీ పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి హాజరైన మాట, వినికిడి లోపం గల మహిళలు పాల్గొని విద్య. ఉపాధి, భద్రత, లింగ సమానత్వం, ప్రజా విధానాల్లో సమావేశం వంటి అంశాలపై కీలక ప్రసంగాలు, ఇంటరాక్టీవ్ సెషన్లు, ఫ్యానెల్ చర్చలు జరిగాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి అభినయ. ఏఐఎఫ్ ప్రధాన కార్యదర్శి రోషన్కుమార్, ఏఐఎఫ్ డబ్ల్యూఎస్ అధ్యక్షురాలు పుజ్జిని జనకి, ఉపాధ్యక్షురాలు ఆల్కా సాహ, గీతా శర్మ, హైకోర్టు న్యాయవాధి రాపోలు భాస్కర్, పిహెచ్ఎఎన్ ప్రధాన కార్యదర్శి పి. బాలకృష్ణారెడ్డి. అఖిల భారతీయ మార్వాడి యువ మంచ్ సభ్యుడు రాజేష్ తదితరులున్నారు.

# కష్టపడి పని చేయాలి : ఎంపీ డీకే అరుణ



**దశ, షాద్ నగర్ :** ఎన్నికలు ఏవైనా కష్టపడి పని చేయాలని ఫలితం సాధించాలని పాలమూరు ఎంపీ డీకే అరుణ నూతన సర్పంచులకు సూచించారు. షాద్ నగర్ నియోజక వర్గంలో నూతనంగా గెలుపొందిన కొందుర్గు మండలం పర్వతాపూర్ బిజెపి సర్పంచ్ బోయ అశోక్, ఫరూఖ్ నగర్ మండలం కడియాల కుంట సర్పంచ్ రాజు నాయక్ ఇద్దరు బిజెపి సర్పంచ్ లు నలుగురు ఉపసర్పంచ్ లు వెల్జెర్ల గ్రామ మిత్రపక్షాల అభ్యర్థి బాబు నాయక్ డా. వెంకటేష్ యాదవ్, వీరన్నపేట్ గ్రామం పరిగి శివకుమార్, నాగుల పల్లి గ్రామం సుమన్ గౌడ్, కమ్మదనం గ్రామం నారాయణ రెడ్డితోపాటు 55 మంది వార్డు మెంబెర్స్ బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున 150 మంది మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణను జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. వారికి డీకే అరుణ శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, విజయ్ బాస్కర్, మోహన్ సింగ్, లష్కర్ నాయక్, చేగు సుధాకర్ అప్ప, శ్యామ్ సుందర్ రెడ్డి, బల్ వంత్ రెడ్డి, మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి, ఎదిర రాజు అనేమోని కృష్ణ యాదవ్, కుదుముల బాల్ రాజ్ ,అనూష, బీమ్ రాజ్,కాటం రాజు, వనం శ్రీనివాస్, ఇంద్రసేన రెడ్డి, హన్మంతు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**దశ, షాద్ నగర్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిన్న ఎల్కిచర్ల గ్రామం అభివృద్ధి పరంగా వెనకంజ వేసిందని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక చర్యలు తీసుకుంటామని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు.

ఆదివారం కొందూరు మండలం చిన్న ఎలికిచర్ల గ్రామం నూతనంగా ఎంపికైన సర్పంచ్ మరాఠి రాజు డిప్యూటీ సర్పంచ్ మహేష్ యాదవ్ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మాజీ కోఆప్షన్ సభ్యులు కలీం భాయ్ ఆధ్వర్యంలో యువనేత అక్రమ్ తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామం నుండి పెద్ద ఎత్తున షాద్ నగర్ ఎమ్మెల్యే గృహం వద్దకు ర్యాలీగా బయలుదేరి వచ్చారు. ఎమ్మెల్యే శంకర్ నూతన సర్పంచ్ ఉప సర్పంచ్ తదితర గ్రామ పెద్దలను ప్రత్యేకంగా సన్మానించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యం చేశారని అందుకే ప్రజా పాలన వచ్చాక గ్రామ స్వరాజ్యం కాపాడేందుకు ప్రభుత్వం అన్ని విధాల నిధులు విధులను కల్పిస్తుందని అన్నారు. ఎంతో కష్టపడి వేయాప్రాయాసులకు వచ్చి గ్రామంలో ప్రజా మద్దతు కూడగట్టుకుని గెలిపించడం సంతోషకరమని మాజీ కోఆప్షన్ సభ్యులు కలీం భాయ్ తతర పార్టీ కార్యకర్తలు నాయకులు కలిసి గెలుపు కృషి చేసినందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యతగా గ్రామాల్లో ముందుకు సాగాలని కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాలని గ్రామానికి తన వంతు కృషి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరాఠీ రాజు ఉప సర్పంచ్ మహేశ్ యాదవ్ వార్డు సభ్యులు సువర్ణ ఆంజనేయులు, యూనుస్ బాయ్ మరాటి భీమయ్య సిద్దు గోపి రవి నక్క లక్ష్మయ్య మాజీ సర్పంచ్ కృష్ణ పంచారాములు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



జపమాల మాత చర్చిలో దివ్య బలి పూజలో భాగంగా కేతేపల్లి గ్రామపంచాయతీ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బీరం జాన్ రెడ్డి, ఉపసర్పంచ్ ఎర్ర బోయిన సతీష్ లని , వార్డు మెంబర్ల అందరిని ఆదివారం చర్చి ఫాదర్ , గుడి పెద్దలు అందరిని సత్కరించి దీవించారు. బీరం జాన్ రెడ్డి మాట్లాడుతూ నన్ను సర్పంచ్ గా గెలిపించినందుకు నామీద నమ్మకాన్ని ఉంచినందుకు మీ అందరికీ పేరుపేరునా రుణపడి ఉంటాను. గ్రామానికి మంచి సేవ చేసి గుర్తింపు తెస్తానని అన్నారు.-(దశ, కేతేపల్లి)



ఆదిభట్ల గ్రామంలో హరిహర పుత్ర అయ్యప్ప సాములు మండల దీక్ష 41 రోజులు పూర్తి చేసుకొని ఆ స్వామి దివ్య దర్శనానికి బయలుదేరుతున్న సందర్భంగా వారి స్వగ్రామంలో వెంకటేశ్వర, ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో బి ఆర్ ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు పల్లె గోపాల్ గౌడ్ ఇరుగుడి, మహా పడిపూజ , అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. -(దశ, ఇబ్రహీం పట్నం )



సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో మంచాల మండలం లోయపల్లి గ్రామంలో బీఆర్ఎస్ -సీపీఎం పార్టీల మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీ "ఆంగోత్ రఘురామ్" కి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) ఇంటింటి ప్రచారంలో పాల్గొని, ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. -(దశ, లోయపల్లి ,ఇబ్రహీంపట్నం )

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..



## ప్రశాంతంగా రెండో దశ ఎన్నికలు

**భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్.**

**దశ, భువనగిరి :** రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతుందని భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ అన్నారు. రెండో దశ గ్రామపంచాయతీ జరుగుతున్న భువనగిరి మండలాల్లో ఈరోజు భువనగిరి డీసీపీ బొల్లాపల్లి, భువనగిరి రూరల్ పోలిస్టేషన్ పరిధిలోని బస్వాపూర్, రామన్న పేట, వలిగొండ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బంది పనితీరును, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని అధికారులకు, సిబ్బందికి ఆయన సూచించారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకోవడం, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పర్యవేక్షించడంలో పోలీస్ యంత్రాంగం నిమగ్నమై ఉందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.





## మహానగరంలో డ్రగ్స్ వినియోగం

**మొదటి పేజీ తరువాయి**

మాసబ్ ట్యాంక్ పోలీసుల సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా MDMA విక్రయిస్తున్న పేడ్లర్ ఒకరు, ఇద్దరు సబ్‌పేడ్లర్లను వారు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 11 గ్రాముల MDMA డ్రగ్స్‌తోపాటు మూడు మొబైల్ ఫోన్లు, బైక్, కారు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ డ్రగ్స్ విలువ రూ. 4.65 లక్షలు ఉంటుందని HNEW అధికారులు చెప్పారు. ఈ MDMA డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్ తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు నిందితులు తమ విచారణలో వెల్లడించినట్లు తెలిపారు. నిందితులు కార్తీక్ అలియాస్ అలెక్స్, బాలాజీ, దీపక్‌గా గుర్తించామన్నారు. 1 గ్రాము MDMA డ్రగ్స్‌ను సాచెట్లుగా ప్యాకింగ్ చేసి విక్రయించినట్లు వారు తెలిపారని వెల్లడించారు. ప్రస్తుతం బాలాజీ గతంలో NDPS కేసులో నిందితుడిగా ఉన్నారని HNEW అధికారులు తెలిపారు. ఈ కేసులో అతడు అరెస్ట్ అయి.. ఆ తర్వాత విడుదలై మళ్లీ ఈ డ్రగ్స్ వ్యాపారంలోకి వెళ్లాడని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసులో NDPS చట్టం కింద మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని వెల్లడించారు. అప్రమత్తంగా ఉండాలంటూ ఈ సందర్భంగా యువతకు HNEW అధికారులు హెచ్చరించారు.



## గేమ్ ఛేంజర్ కానున్న 13 ప్రాజెక్టులు

**దశ, హైదరాబాద్:**

తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్లోబల్ సమ్మిట్ వేదికగా ఆవిష్కరించారు. సమ్మిళత, సుస్థిర అభివృద్ధితో పాటు ప్రజల ఆశలు, ఆకాంక్షలు, అవసరాలు, సామర్థ్యాలకు అనుగుణంగా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం 10 వ్యూహాలను ఈ విజన్ డాక్యుమెంట్‌లో పొందుపర్చారు. మూడు మూల స్తంభాలైన ఆర్థిక వృద్ధి, సమ్మిళిత అభివృద్ధి, సుస్థిర అభివృద్ధి సాయంతో తెలంగాణలో 13 గేమ్ చేంజర్ ప్రాజెక్టులను తీర్చిదిద్దడం ద్వారా 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోటీ పడడం కాకుండా ప్రపంచంలోనే ఉత్తమ నగరాలతో పోటీపడే విధంగా హైదరాబాద్ నగరాన్ని, తెలంగాణ రాష్ట్రంను తీర్చిదిద్దేందుకు గేమ్ చేంజర్ ప్రాజెక్టులను ఎంచుకున్నామని చెప్పారు.

### మూడు మూలస్తంభాలివే..

**ఆర్థిక వృద్ధి :** ఆవిష్కరణలు, ఉత్పాదకతల పునాదులపై జరిగే అభివృద్ధి ఆధారంగా క్యూర్-ప్యూర్-రేర్ విధానంతో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రూపకల్పన.

**సమ్మిళిత అభివృద్ధి :** ఈ వృద్ధి ఫలాలను యువత, మహిళలు, రైతులు, అట్టడుగున ఉన్న వర్గాలు, సమాజంలో అన్ని వర్గాలకు అందించడం.

సుస్థిర అభివృద్ధి : హరిత మార్గంలో 2047 నాటికి అన్ని రంగాల్లో సుస్థిరత.

**13 గేమ్ చేంజర్ ప్రాజెక్టులివే..**

భారత్ ఫ్యూచర్ సిటీ,
మూసీ పునరుజ్జీవనం,
డ్రైపోర్టు
డ్రైపోర్టు నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు 12 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే
బెంగళూరు, అమరావతి మీదుగా చెన్నైకు హైదరాబాద్ నుంచి బుల్లెట్ ట్రైన్ కారిడార్లు
ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్యలో తయారీ రంగం అభివృద్ధి
రీజనల్ రింగు రోడ్డు
ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్‌లను కలుపుతూ రేడియల్ రోడ్లు
రీజనల్ రింగ్ రైల్వే
వ్యవసాయ భూములకు గ్రీన్ ఎనర్జీ
ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్స్
గ్రీన్ ఎనర్జీ హబ్స్
ఎలక్ట్రానిక్ వాహనాలను పెద్ద సంఖ్యలో వినియోగించడం

# ఓడిన,గెలిచిన కాంగ్రెస్ పార్టీలోకే...

**మొదటి పేజీ తరువాయి**

ఖర్చు పెట్టామని, అయినప్పటికీ అధికార అభ్యర్థులుగా తమను ప్రకటించలేదని ఈ పరిణామంలో ఆయా గ్రామాలలోని రెబల్ అభ్యర్థులు బీఆర్ఎస్ ఇతరుల మద్దతుతో లక్షలు ఖర్చు పెట్టి ఎన్నికల బరిలో నిలిచి గెలిచామని ఇప్పుడు పార్టీ కండువా కప్పుకోమంటే ఓట్లు వేసిన ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నిబంధనలను పాటించాల్సిన కోదాడ చిలుకూరు మండల పార్టీ అధ్యక్షులే విస్మరించి ఒకరు అధికార అభ్యర్థికి వ్యతిరేకంగా రెబెల్ అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలిపితే మరొకరు ఏకంగా తన గ్రామంలో పార్టీ అభ్యర్థిని నిలపకుండా టీడీపీ అభ్యర్థిని గెలిపించడం పట్ల నిబద్ధత గల కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





మరికొన్ని చోట్ల కష్ట కాలంలో జెండా మోసిన వారిని కాదని ఇటీవల పార్టీలోకి వచ్చిన మోతుబరులకు మద్దతు ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. తమ గ్రామాలలో పార్టీ పక్షాన నియోజకవర్గ స్థాయి నాయకులు కనీస ప్రచారానికి నోచుకుపోవడం సమంజసమేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడప్పుడే తాము పార్టీ కండువా కప్పుకోలేమని మాట దాటవేస్తున్నట్టు తెలుస్తోంది

## పోలింగ్ నిర్వహణ,ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**మొదటి పేజీ తరువాయి**

నిర్వహణను,ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీ చేయు సర్పంచి,వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు.మధ్యాహ్నం ఒంటి గంట లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.ఒంటి గంట తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి ఎవ్వరిని అనుమతించకూడదనీ,మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని కలెక్టర్ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులను ఆదేశించారు. ముందు వార్డు సభ్యులకు సంబంధించిన ఓట్లు లెక్కించిన తదుపరి సర్పంచ్ ఓట్లు లెక్కించడం జరుగుతుందని అన్నారు.కలెక్టర్ వెంట చేవెళ్ళ ఆర్డీఓ చంద్రకళ,మొయినాబాద్ తహసీల్దార్ గౌతం,తదితరులు ఉన్నారు



## దక్షిణాఫ్రికాపై చెలరేగిన టీమిండియా బౌలర్లు..

**మొదటి పేజీ తరువాయి**

టీమిండియా బౌలర్లలో హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి రెండేసి వికెట్లు దక్కించుకున్నారు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబె ఒక్కో వికెట్ పడగొట్టారు. చివరకు దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 117 పరుగుల స్వల్ప స్కోరుకే ఆలౌటూంది. తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. మరి, ఈ మ్యాచ్‌లో విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి. ఇప్పటికే జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 11తో సమంగా ఉన్నాయి. కటక్ మ్యాచ్‌లో టీమిండియా, ముల్లాన్‌పూర్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించి సమఉజ్జీలుగా ఉన్నాయి.

ఈ సందర్భంలో ధర్మశాలలో గెలిచి సిరీస్‌లో 2-1 తో ముందడులో భారత్ నిలిచింది. స్వల్ప స్కోర్ చేధించే క్రమలో భారత్ మూడు వికెట్లు కోల్పోయి సునాయస విజయాన్ని అందుకుంది. సిరీస్‌లో ముందడుగు వేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఇండియా అదరగొట్టింది. బౌలింగ్ లో వరుణ్, కులుదీప్ , అర్ష్దీప్ , హర్షిత్ రాణా తలో రెండు వికట్లు తీసి జట్టు గెలుపునకు పునాది వేసారు.దీంతో టీం20 సిరీస్‌లో భారత్ అధిక్యంలో నిలిచింది.

# రైతుల నీటి హక్కులపై ఉద్యమానికి బీఆర్ఎస్ సిద్ధం

**మొదటి పేజీ తరువాయి**

ప్రస్తుతం కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలని కేంద్రం ముందు దేబరించడం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయపడుతుంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 45 టీఎంసీలకు అంగీకరిస్తూ కేంద్రం వద్ద మోకరడం రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని బీఆర్ఎస్ భావిస్తోంది. రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ చెబుతోంది. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి నల్లగొండ ప్రజల రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటున్న నేపథ్యంలో, తెలంగాణ నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపీలు ఉండి కూడా ఒక్కరూ మాట్లాడడం లేదని వ్యాఖ్యానిస్తోంది. ఇంకా చెప్పాలంటే... బీజేపీ.. తెలంగాణ ప్రయోజనాలను గండి కొడుతున్నట్లుగా ఉందని స్పష్టమవుతున్నదని బీఆర్ఎస్ చెబుతుంది. తెలంగాణ రాష్ట్రానికి సాగునీటి విషయంలో కాదు.. కావేరి తదితర నదుల అనుసంధానం పేరుతో ఆంధ్ర రాష్ట్ర జల దోపిడికి సహకరిస్తున్న బీజేపీ విధానాన్ని ఎదుర్కోవాలంటే.. తెలంగాణ సమాజం మరో సారి ప్రత్యక్ష పోరాటాలే శరణ్యమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు.2023 ఏడాది జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో రాసి అధికారంలోకి వచ్చి ఉంటే.. ఈ పాటికి పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి నీళ్లు అందడం ద్వారా మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజల ప్రయోజనాలు కాపాడబడేవని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. కానీ ప్రస్తుతం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం .. ఈ మూడు జిల్లాల ప్రయోజనాల పట్ల పూర్తి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం వల్ల పూచిక పొల్లంత పని కూడా చేయలేక పోవడం వల్ల ఆ ప్రాంతం ప్రజలు, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ అగ్రనాయకత్వం ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఈ ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు గడిచినా కూడా, తెలంగాణ రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తుండడంపై ఇంకా తెలంగాణ సమాజం మౌనం వహించ జాలకూడదని ఆ పార్టీ అభిప్రాయపడుతుంది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు, కృష్ణా జలాలలో కేవలం 45 టీఎంసీలు ఒప్పుకోవడం అనేది ఘోరమని అభివర్ణించింది. కాబట్టి సాగునీరు తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను కాపాడే విషయంలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నటికీ రాజీ పడబోదని ఆ పార్టీ స్పష్టం చేసింది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఈ కీలక అంశాలపై కూలంకుషంగా చర్చ జరగనుంది. అలాగే అందుకు అనుగుణంగా చేపట్ట బోయే ప్రజా ఉద్యమాల నిర్మాణం, అనుసరించాల్సిన కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణం, జలాల కేటాయింపు, గోదావరి కృష్ణా జలాల విషయంతోపాటు ఆంధ్ర జల దోపిడిపై పోరాడేందుకు.. ఒక ఉద్యమ స్వరూపానికి ఈ సమావేశంలో శ్రీకారం చుట్టడం జరుగుతుంది. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు ఏపీ ప్రభుత్వం పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ చేపట్టేందుకు ప్రయత్నించగా.. ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తెలంగాణ ప్రభుత్వం తీసుకు వెళ్లింది. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం పక్కన పెట్టింది. తాజాగా పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం తెర మీదకు తీసుకు వచ్చింది. దీనిపై సైతం కేంద్రానికి ఫిర్యాదు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీసుకెళ్లారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ పేరు మార్చి నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌గా ఏపీ ప్రభుత్వం తన వంతు ప్రయత్నాలు చేపట్టిందంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి శాఖకు రాసిన లేఖ సైతం వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల నీటి హక్కులపై పోరు చేయాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తోంది. అదీకాక రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం జరిగినా.. ఇంకా తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలు నేటికి అలాగే ఉన్నాయి. వాటిని పరిష్కరించుకోవడం లేదు. వీటిని పక్కన పెట్టి ఏపీ ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న ప్రాజెక్టులపై కేంద్రానికి ఫిర్యాదు చేయాల్సి వస్తోంది. అదీకాక.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సైతం రైతుల నీటి హక్కులపై ఉదాసీనంగా వ్యవహరిస్తోందంటూ గత కొంత కాలంగా బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకులు ఆరోపణలు సంధిస్తున్న సంగతి తెలిసిందే.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.